INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# ఖమ్మం జిల్లా బడిపిల్లల కథలు – మానవీయత

– డా॥ జంపాల అనూరాధ
ఎం.ఏ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు
ఎస్.ఆర్. & బి.జి.ఎన్.ఆర్. గవర్నమెంట్ ఆర్ట్స్ & సైన్స్
కళాశాల (అటానమస్), ఖమ్మం. తెలంగాణ

## వ్యాస సంగ్రహం :

బాలల సాహిత్యాన్ని నిర్వహించటం చాలా క్లిష్టం. బాలల్లో భిన్న వయస్సుల్లో ఉండే ఊహాశక్తి ఆధారంగా వారివారి ఆసక్తులు ఉంటాయి. అందువల్ల బాలల కోసం రాసే సాహిత్యంలో 2 నుంచి 16 సంవత్సరాల మధ్య వివిధ వర్గాలుగా విభజన ఉంటుంది. బాలలకోసం రాసే రచయితలు ఆ వయోపరిధిని దృష్టిలో ఉంచుకొని తమ రచనలు చేస్తారు.

బాలల్లో ఊహాశక్తి కాస్త పరిణతి చెందాక, వారికి భాషాపరమైన వాక్యనిర్మాణం అలవడ్డాక వారు తమ ఊహల్ని అక్షరీకరించే ప్రయత్నం చేస్తారు. కల్పనాసాహిత్యంలో పిల్లల్ని ఎక్కువగా ఆకర్షించేది కథ కనుక వారు దానిని రాసే ప్రయత్నం చేస్తారు. ఈ రచనలకి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఊతం గనక ఉండేమంచి సృజన పుడుతుంది.

అప్పుడే వికసిస్తున్న మెదళ్ళ నుండి వెలువడే స్వచ్ఛమైన ఆశావాదం, మానవతావాద పరిమళాలున్న కల్పనా సాహిత్య సృష్టిని ఆస్వాదించి ప్రోత్సహించటం వల్ల, నవసమాజానికి మానవీయ ద్వారాల్ని తెరవగలం.

## ఉపోద్ఘాతం :

బాలల కోసం సృష్టించబడే సాహిత్యం మిగతావాటికన్నా చాలా క్లిష్టమైనది, అమూల్యమైనది. ఈ బాల సృజన కోసం రచయిత లేదా కవి పూర్తిగా బాల్యపు దశలోకి వెళ్ళి ఆయా ప్రక్రియల్ని సృజించాలి. ఆ సృజనలో నీతిబోధ, క్లుప్తత, సృజనశీలతను పెంచేలా సంఘటనలు, తార్కికమైన ఆలోచనా విధానాన్ని అలవర్చే పాత్రలు, నైతికతను నేర్పే సంభాషణలు, భాషణశక్తిని పెంచే పదప్రయోగాలు, సంస్కృతీ సంప్రదాయాల పట్ల అభిరుచి పెంచే వర్ణనలు, దేశభక్తిని పెంపొందించే కథనాలు.... ఇలా ఒకటా రెండా...బాలల మూర్తిమత్వాన్ని నిర్దేశించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే అనేకమంది గురువుల సమిష్టి బాధ్యతని బాల సాహిత్యం తన గురుతర బాధ్యతగా భుజాల మీద మోస్తుంది. గతంలో బాలలకోసం ప్రత్యేకమైన మాసపత్రికలు ఉండేవి. పలువురు రచయితలు విరివిరిగా బాలలకోసం అనేకానేక పుస్తకాలను ప్రచురిస్తూ ఉండేవారు. వాటికి విశేష ఆదరణా ఉండేది. మిగిలిన వార, మాస పత్రికలు సైతం బాలలకోసం ఒకటి రెండు పేజీలు కేటాయించి గేయాలు, పద్యాలు, నీతికథలు, పజిల్స్ వంటి అనేక శీర్షికల్ని ప్రచురించేవి. ఇవన్నీ బాలల సృజన శక్తిని పెంపొందించేందుకు తోడ్పడటమేకాక, వారి నైపుణ్యాలను వివిధ రీతుల్లో మెరుగుపరిచేవి. సామాజికంగా ఎదిగేందుకు బాలసాహిత్యం గొప్ప మార్గదర్శిగా ఉండేవి. పరిపూర్ణ మానవునిగా ఎదిగే క్రమంలో బాలలకి ఈ సాహిత్యం ఇతోధికంగా సాయపడేది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

**వ్యాసఉద్దేశం :** ఆధునిక సాంకేతికయుగంలో అతివేగంగా మారుతున్న సామాజిక పరిస్థితుల్లో బాలసాహిత్యం కూడా రూపుమార్చుకుంది. బాలల పత్రికలు దాదాపు కనుమరుగయ్యాయి. ఉన్నవాటికి కూడా ఆదరణలేదు. బాలసాహిత్యం రూపుమార్చుకుని డిజిటల్ యుగంలోకి ప్రవేశించింది. ఆడియో, వీడియోల రూపంలో దృశ్య శ్రవణ మాధ్యమంలోకి ప్రవేశించింది. అమ్మమ్మకథలు / తాతయ్య కథలు / బామ్మ చెప్పిన కథలు / బాల గేయాలు... ఇలా వివిధ రూపాల్లో అంతర్జాలంలోకి ప్రవేశించిన బాల సాహిత్యం, ప్రాచుర్యపరంగా విశేష ఆదరణ పొందింది అనాలి. అంతర్జాలపు వివిధ శాఖల్లో బాలసాహిత్యం విపరీతంగా పొందుపరచబడుతుంది. వాటిలో బాగున్నవాటికి ఆదరణ, ఆదాయం కూడా లభిస్తూ ఉంది. సాంకేతికంగా బాలల నిష్పత్తితో పోలిస్తే బాల సాహిత్యం బాగా వెనకబడింది. పిల్లల గేమింగ్ వీడియోలు, యాప్‌లతో పోల్చినప్పుడు ఆయా గేమింగ్‌లకూ బాలసాహిత్యపు ఛానల్స్‌కీ మధ్య అంతులేని దూరం ఉందన్నమాట కఠోరమైన సత్యం. ఈ విషయాలనన్నింటిని దృష్టిలో ఉంచుకుని, ఆధునిక కాలంలో బాల రచయితల కథలని విశ్లేషించటం ఈ వ్యాస ఉద్దేశం.

**బాల రచయితల రచనలు –బాల సాహిత్యం –**

బాలలకోసం పెద్దలు శ్రమకోర్చి వ్రాసిన సాహిత్యాన్ని బాలసాహిత్యంగా పరిగణిస్తూ ఉంటాం. నిజానికి దీనిని "బాలలకోసం సాహిత్యం" అనాలి. ఈ విధమైన "బాలలకోసం సాహిత్యం" సృష్టించిన వందలాది మంది రచయితలు, కవులు తెలుగునాట ఉన్నారు. ప్రత్యేకంగా తెలంగాణ అవతరణ తర్వాత తెలంగాణ జిల్లాల వారీగా కవులు, రచయితలు సమీకృతం అవుతూ వారివారి ప్రాంతీయ పరిమళాన్ని సాహిత్యానికి అద్దే ప్రయత్నం చాలా వరకు సఫలమవుతూ ఉంది. ఈ దశలోనే జిల్లాల వారీగా బాల సాహితీవేత్తల్ని గుర్తించి, వారి వారి రచనల్ని అందించే దిశలో వివిధ సాహితీ సంస్థలు తమవంతు ప్రయత్నాలు చేసి బాలసాహిత్య పరిపుష్టికి దారులు ఏర్పరుస్తున్నాయి. ఈ దిశలో అసలు బాలలే తమ సాహిత్యాన్ని సృష్టిస్తే దాని పరిమళం ఎలా ఉంటుందో అనే ఆలోచన గలిగిన సంస్థలూ వ్యక్తులూ అలాంటి ప్రయత్నాలు చేశారు. "భూమిక" లాంటి మాసపత్రికలు, మరికొన్ని బాలల పత్రికలూ బాలలే రాసిన కథలు, కవితలు, బొమ్మలు ప్రచురిస్తూ వారిని రచనాపరంగా వికసించేలా చేస్తున్నాయి.

బాలసాహిత్యం మీద పరిశీలన అనగానే వివిధ ప్రక్రియల్లో చేయి తిరిగిన, లబ్ధిప్రతిష్టగల అనేక మంది సాహితీవేత్తలు గుర్తొస్తారు. వీరి రచనల మీద చాలా మంది విశిష్టమైన పరిశోధనలు కూడా చేశారు. బాల సాహిత్యపు తీరుతెన్నులు ఎలా ఉండాలో.... ఎలా ఉంటాయో లక్ష్యలక్షణ సమన్వయంతో నిగ్గుదేల్చి నిర్దేశించారు.

నిజానికి బాలలు తమకోసం వచ్చే సాహిత్యం ఎలా ఉండాని కోరుకుంటారు? అనే ప్రశ్నకి సమాధానం తెలియాలంటే బాలలు సృజించిన సాహిత్యాన్ని పరిశీలించాల్సిందే. ఈ దిశగా జరిగిన ప్రయత్నాలు చాలా అరుదు. పిల్లలు రాసిన కథల్ని ప్రచురించటం నిజంగా పెద్ద సాహసమే.

ఈ దిశలో...... "తెలంగాణలో బాలరచయితలు– రచనా వికాసం" గురించి శ్రీ పత్తిపాకమోహన్, "బాలసాహిత్యంలో విద్యార్థుల సృజనాత్మక రచనలు" గురించి శ్రీపుల్లా రామాంజనేయులు, వంటి వారి పరిశోధనా ప్రయత్నాలు సఫలీకృత మయ్యాయి. ఏమైనా బాలల కోసం పెద్దలు రాసిన సాహిత్యం పై జరిగినంత విషయచర్చ, బాలలు రాసిన సాహిత్యంపై జరగలేదు.


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ఈ దిశలో ఖమ్మంజిల్లా బాలసాహిత్యంపై దృష్టిసారిస్తే అసంఖ్యాకంగా రచయితలు, సాహిత్యం కనిపించి చాలా సంతోషం కలిగింది. ఈ పరిశీలనతోనే మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ప్రచురణల్లో భాగంగా “బాలచెలిమి పిల్లల వికాస పత్రిక” వారి ద్వారా వెలువడిన “ఖమ్మంజిల్లా బడిపిల్లల కథలు” అనే పుస్తకం కనిపించగానే మరింత ఆనందమైంది.

ఈ ప్రచురణకర్తల ఆధ్వర్యంలో తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలలోని బడిపిల్లల కథల్ని విడివిడిగా ఆయా జిల్లాల పేర్లతో పది సంకలనాలుగా ప్రచురించటం నిజంగా చాలా ఉన్నత ఆదర్శం, సాహితోపేతంగా పేర్కొనవలసిని విషయం. ఇక కథల విషయానికి వస్తే బాల్యదశలో ఉండే పునరుక్తి, వ్యాకరణ దోషాలు వదిలి పిల్లల ఆలోచనల్ని, ఊహల్ని ప్రాతిపదికగా చదవమని ప్రచురణకర్తలే సూచించారు.

ఖమ్మం జిల్లాకు సంబంధించిన బాలసాహిత్యంలో నిష్ణాతులైన రచయితలు, కవులు అనేకమంది తమతమ రచనాల ద్వారా బాలల మానసికోన్నతికి దోహదపడుతున్నారు. స్వయంగా ఈ జిల్లా బాలలు రాసిన కథల్లో ఎలాంటి పరిణతి కనబరిచారు అనే ఉత్సకత ఈ పరిశోధనకి బీజం వేసింది. కథలు చదివాక వివిధ నేపథ్యాలు, వివిధమైన కథనరీతులు, వివిధ కథాంశాలు ఉన్న ఈ కథల్లో ఏకరూపంగా ఉన్న మానవీయకోణం నన్ను అబ్బుర పరిచింది. చిన్న వయస్సులో వీళ్ళందరి రచనల్లో అంతర్లీనంగా మానవీయత అనే జీవజలం ప్రవహించటం చాలా చాలా గొప్ప విషయం అనిపించింది. ఈ విశేషమైన అంశమే ప్రధాన లక్ష్యంగా ఈ వ్యాసం సాగుతుంది.

## కథల విశ్లేషణ :

“ఖమ్మం జిల్లా బడిపిల్లల కథలు” చిరుపొత్తంలో మొత్తంగా 18 కథలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక స్థాయి పిల్లల నుండి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివే పిల్లల వరకు ఉండటం విశేషం. ఆ పసి హృదయాలలో మెదిలిన చిరు సృజనాలోచనలు వారి బుల్లి మెదళ్ళలో అక్షరాలై మొలకలెత్తి, కథా పొదలుగా ఎదిగి ఈ కథా సంకలనపు సుమాలపంటగా వెలుగు చూడటం చాలా విశేషమైన ప్రయాణమే.

ఈ సంకలనం లోని మొదటికథ ఐదవ తరగతి చదివే **“సాత్విక్”** రచన. కథపేరు **“సహాయం”**. ఫలితాన్ని ఆశించకుండా సహాయం చేయటం అనే మానవీయ కోణాన్ని ఆవిష్కరించే కథ ఇది. శాంతయ్య చిన్నకారు రైతు. తనకు ఉన్నదానిలోనే ఇతరులకు సహాయం చేయటం అతని లక్షణం. భార్య వారిస్తున్నా తన లక్షణం మార్చుకోడు. చివరికి అతని మంచితనమే రక్షగా మారి, దారిలో దొరికిన పక్షి రోజూ పెట్టే బంగారు గుడ్ల వలన ధనవంతుడై ఇంకా విశేషమైన సహాయాలు చేసే అవకాశం పొందాడు. ఉన్నదాంట్లోనే పరులకి సాయపడటం అనే మానవీయ గుణాన్ని ఆవిష్కరించిన కథ ఇది. ఐదవతరగతిలోనే విశిష్టమైన సృజనశక్తితో ఆసక్తికరమైన కథని క్లుప్తంగా నేర్పుగా నడిపించిన ఈ బాల రచయితలో గొప్ప మానవతావాది ఉన్నాడని చెప్పొచ్చు.

**“పూజితా శ్రీ”** అనే ఏడోతరగతి విద్యార్థిని రాసిన కథ **“అపకారికి ఉపకారం”**. అడవిలో పిల్లిబారిన పడిన ఎలుక పారిపోతూ పులిని శరణువేడుతుంది. పులి సహాయం చేయకపోగా పిల్లిని ప్రోత్సహిస్తుంది. ఎలుక పారిపోయి సింహాన్ని శరణు కోరుతుంది. సింహం, పిల్లిని మందలించి ఎలుకను కాపాడుతుంది. కొన్నాళ్ళకి వేటగాడి వలలో పులి, సింహం రెండూ చిక్కుకుంటాయి. వాటిని చూసిన ఎలుక వలతాళ్ళు కొరికి వాటిని బంధవిముక్తిల్ని చేస్తుంది. అపకారికి కూడా ఉపకారం చేసిన ఎలుక మంచితనం చూసిన పులి పశ్చాత్తాపపడుతుంది.

ఈ మొత్తం ఘటన గమనించిన వేటగాడుకూడా పరివర్తన పొంది వేటాడటం మానుకోవటం కథలో చివరి మలుపు. కథమొత్తంలో అపకారికి కూడా ఉపకారమే చేయాలి అనే మానవీయ సూక్తిని సోదాహరణంగా కొత్త ముగింపుతో చెప్పటం ఈ బాల రచయిత్రి ప్రత్యేకత.

పదోతరగతి చదివే **"లావణ్య"** రాసిన కథ **"స్నేహం కోసం"** ప్రాణమిత్రులైన జింక, దుప్పిలను చూసిన సింహం వాటితో స్నేహం చేసింది. కుటిలత్వంతో కూడిన ఆ స్నేహం కొనసాగుతుండగా ఒక రోజు నీరసంగా ఉన్న సింహాన్ని చూసి దుప్పి, జింక కారణం అడుగుతాయి. మీ స్నేహం వల్ల నేను వేటాడటం మానేశాను. దాంతో నీరసించిపోయాను అంటుంది సింహం. స్నేహితుని ఆకలి తీర్చటం కోసం దుప్పి, జింకలు తనని తినమంటే తనని తినమని పోటీ పడి ముందుకొస్తాయి. స్నేహం కోసం ప్రాణార్పణ చేస్తున్న ఆ స్నేహితుల్ని చూసి సింహం వాటిని చంపకపోవటం ఈ కథలో మానవత్వపు ముగింపు. జంతుజాలాన్ని పాత్రలుగా అల్లిన కథ అయినా అంతర్లీనంగా మానవీయకోణాన్ని మిళితం చేయటంలో ఈ బాల రచయిత్రి నేర్పు అమోఘం అనాలి. మానవీయతలోని త్యాగం అనే అంశాన్ని సజీవంగా నిలిపిన కథ ఇది.

పదోతరగతి చదువుతున్న **"నవ్య"** రాసిన కథ **"మార్పు"**. ఒక అడవిలోని విభిన్న గుణాలు గల నెమలి, కోకిల , కాకి స్నేహంగా ఉండేవి. వీటిలో కాకి కొంచెం తగవుల మారి అయినా వాటి స్నేహానికి ఏమీ ఇబ్బంది కలగలేదు. కాకి తగాదాపడిన ప్రతిసారీ ఇతర పక్షులు, జంతువులు తిరగబడితే కోకిల, నెమలి సర్ది చెప్పికాకిని కాపాడేవి. నెమలి, కోకిల చెప్పిన మంచి మాటలు నచ్చక కాకి వాటి నుంచి దూరంగా వెళ్లిపోతుంది. ఈసారి ఇతర పక్షులు కాకిని బాగా దండించసాగాయి. అప్పుడే కాకికి స్నేహితుల విలువ అర్థమైంది. మన మంచి కోరే వారు చెప్పే మాటవిని, దానిని ఆచరించాలని అర్థం చేసుకున్న కాకి స్నేహితుల్ని చేరి మంచిగా మారి హాయిగా జీవించింది. హితుల మాటలు వినాలనీ, స్నేహితులను చెడుమార్గం నుంచి మళ్ళించేందుకు మందలించవచ్చు అనే మానవీయ సూక్తులని ఆవిష్కరించిన మంచికథ ఇది.

తొమ్మిదోతరగతి చదివే **"కిరణ్కుమార్"** రాసిన కథ **"ఆవు– మనిషి"**. రామయ్య, సోమయ్య అన్నదమ్ములు. ఎవరి సంసారాలు వాళ్ళవి. ఒకనాడు సంతలో అన్నదమ్ములు ఒకేలా ఉన్న రెండు ఆవుల్ని కొన్నారు. రామయ్య తన ఆవుని బాగా మేపడం వల్ల అది బలిష్టంగా తయారైంది. సోమయ్య సరైన పోషణ చేయకపోవటంతో అతని ఆవు చిక్కిపోయింది. రామయ్య ఆరోగ్యం బాగోకపోవటంతో ఆవులు రెండింటినీ సోమయ్య మేతకు తోలు కెళ్ళేవాడు. దుర్బుద్ధి సోమయ్య తన బక్కావుని రామయ్యకు తోలి, అదే అతనిది అని వాదించాడు. ఊరి పెద్దలు పంచాయితీలో ఎద్దుల్ని వదిలి పెట్టగా బలిసిన ఆవు రామయ్య ఇంటికి, బక్కచిక్కిన ఆవు సోమయ్య ఇంటికి వెళ్ళాయి. బక్కావు తిరిగి రామయ్య ఇంటికి వచ్చింది. మూగజీవుల్ని ప్రేమగా సాకితే అవి అపార విశ్వాసంతో ఉంటాయి అని తెలిపే కథ ఇది. పశువుల్ని కూడా ప్రేమగా సాకాలనే మానవీయకోణాన్ని అంతర్లీనంగా కలిగిన కథ ఇది.

ఐదవతరగతిలోని **"కమల్నాథ్"** రాసిన కథ **"ఓ అమ్మకథ"**. రోడ్డు ప్రమాదంలో రంగయ్య చనిపోతే పిల్లల బాధ్యతని అతని భార్యమోసింది. పిల్లల్ని ప్రయోజకుల్ని చేసింది. పిల్లలు తల్లి కష్టం మరిచిపోక ఆమెను సుఖంగా ఉంచి సంతోషపెట్టారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలనే మానవీయసూక్తిని బిడ్డలందరికీ చేర్చే చిన్నకథ ఇది.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in
Cover Page

తొమ్మిదో తరగతి **"హర్షిత"** రాసిన కథ **"అత్యాశ"**. అడవిలోని జంతువులకు వేటమాంసం ఆశచూపి నీటిచెలమ వద్ద అర్ధరాత్రి ఒక్కో జంతువుని అవతలి ఒడ్డుకు తీసుకెళ్ళి చంపి తినసాగింది సింహం. చాలా జంతువుల్ని అత్యాశతో తిని కడుపునొప్పితో చచ్చింది. అత్యాశ వల్ల ఎప్పటికైనా ప్రమాదమే అనే మానవీయపు నీతిని తెలిపే కథ ఇది.

తొమ్మిదో తరగతి చదివే **"ఉమామహేశ్వరి"** రాసిన కథ **"మార్పు".** పేదరికం వల్ల వాణికి బాల్య వివాహం చేశారు తల్లిదండ్రులు. వాణి భర్త తాగుబోతు. ఆమెను నిత్యం కొట్టేవాడు. ఆ విషయం తెలిసి వాణి తల్లిదండ్రులు దిగులతో చనిపోయారు. వాణి ధైర్యంగా నిలిచి గ్రామ సర్పంచ్‌కి ఫిర్యాదు చేసింది. ఆయన మానవతవ్వంతో ఆమెకు కుట్లు, అల్లికల వంటి స్వయం ఉపాధి కల్పించి, ఆమె భర్తను మందలించి మంచి మార్గంలో పెట్టాడు. మానవత్వంతో వారికి కొంత ఆర్థిక సహాయం చేశాడు. పట్టుదల ఉండే ప్రతికూల పరిస్థితుల్ని కూడా అనుకూలంగా మార్చవచ్చు అని, పదవితోపాటు మానవత్వం ఉంటే ఎన్నో కుటుంబాల్ని మార్చవచ్చు అని నిరూపించిన సాంఘీక కథ ఇది.

పదోతరగతి **"లిఖిత్"** రాసిన కథ **"రెండు కళ్ళు"**. పదోతరగతి తెలుగుక్లాసులో ఉపాధ్యాయుడు "యక్షప్రశ్నలు" పాఠం పూర్తి చేసి పిల్లలకి ఒక సవాల్ విసిరారు. యమధర్మరాజు మీ తల్లిదండ్రుల్ని స్పృహ తప్పేలా చేసి మిమ్మల్ని ప్రశ్నలు అడిగి, మెచ్చుకొని, తల్లిదండ్రుల్లో ఎవర్నో ఒకర్ని బ్రతికించుకోవచ్చు అంటే మీరు మీ తల్లిదండ్రుల్లో ఎవర్ని బ్రతికించుకుంటారు అనేది సవాల్. ఒకరు తల్లి అని, ఇంకొకరు తండ్రి అని చెప్పారు. "త్రినాథ్" మాత్రం ఇద్దరూ నాకు రెండు కళ్ళలాంటి వారు. కనుక ఇద్దర్నీ బ్రతికించు లేదా నన్ను కూడా వారితో తీసుకెళ్ళు అని కోరతాను అన్నాడు. తల్లిదండ్రులపై సమదృష్టి అనే మానవీయ కోణాన్ని స్పర్శించిన కథయిది.

పదోతరగతి విద్యార్థిని **"లావణ్య"** రాసిన కథ **"పుస్తకాల విలువ".** తిండిబోతు భాగ్యలక్ష్మికి రోజూ బడికి వస్తూ ఏదో ఒకటి కొనుక్కు తినటం అలవాటు. చివరికి పుస్తకాలని చిత్తు కాగితాల క్రింద అమ్మి పీచుమిఠాయి కొనుక్కుతినేది. తెలుగు టీచర్ ఈ విషయం గుర్తించి భాగ్యలక్ష్మి వాళ్ళ అమ్మకి తెలిపారు. ఆమె కూతురుకి హితబోధ చేసింది. ఇంతలో తెలుగు టీచర్ ఫోన్ చేసి భాగ్యలక్ష్మిని దండించవద్దని, తన వద్ద ఉన్న అదనపు పుస్తకాలు భాగ్యలక్ష్మికి ఇస్తానని మానవత్వంతో చెప్పారు. భాగ్యలక్ష్మిలో ఈ ఘటన తర్వాత మార్పు వచ్చింది. తరగతిలో ఆమె ఫస్టు వచ్చింది.

తొమ్మిదో తరగతి **"నిహారిక"** కథ **"ఐడియా".** అడవిలోని జంతువులన్నీ పరస్పర సహాయంతో సహజీవనం చేసేవి. ఒకనాడు వేటగాడు మాటున తవ్విన గోతిలో కుందేలు పడిపోయింది. ఏనుగు ఉపాయం చెప్పింది. కొండచిలువ చెట్టుకు చుట్టుకుని, తన తోకను గోతిలోకి విసిరింది. కోతులు ఆ తోక ఆధారంగా గోతిలో దిగి, కుందేలును పైకి తెచ్చాయి. మనుషులకైనా జంతువులకైనా "కలిసి ఉంటే కలదు సుఖం" అనే సమైఖ్యమానవీయ సూక్తిని తెలిపే కథ ఇది.

పదోతరగతి **"తులసీరాం"** కథ **"శత్రువులతో స్నేహం అపాయం".** వేటగాడి వలనుంచి పిల్లిని తప్పించిన ఎలుకను పిల్లి స్నేహంగా ఉందాం అని ఆహ్వానిస్తే ఎలుకను తిరస్కరిస్తూ శత్రువుతో స్నేహం అపాయకరం అనే సూక్తిని చెబుతుంది.


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

నాలుగోతరగతి విద్యార్థిని **"ఆదితిజ"** రాసిన కథ **"మంచి మిత్రులు".** తనని కాపాడిన వ్యక్తికి కొంగ ఎలా సాయపడిందో తెలిపే చిన్నకథ. మనం లాభాపేక్ష లేకుండా చేసేసాయం మనకి మరోరూపంలో సాయంగా అందుతుంది అని తెలిపేకథ ఇది.

తొమ్మిదో తరగతి **"ఆమని"** రాసిన కథ **"బంగారు కోడిగుడ్డు".** మానవత్వంతో మనం ఇతరుల ఆకలి తీర్చితే ఆ ఫలితం మనకి మరో రూపంలో అందుతుంది అనే మానవీయ సందేశం ఉన్న కథ యిది.

తొమ్మిదోతరగతి **"ప్రస్తుతి"** రాసిన కథ **"కష్టం-ఫలితం".** కష్టపడి దాచుకున్న శాంతమ్మ డబ్బు దొంగపాలైతే వాడు పారిపోతూ కొండచిలువ బారిన పడి చనిపోగా డబ్బు మళ్ళీ శాంతమ్మకే దక్కింది. కష్టం యొక్క ఫలితం ఎప్పుడూ మనని వీడిపోదు అనే మానవీయ స్ఫూర్తిని చెప్పే కథ యిది.

తొమ్మిదో తరగతి చదివే **"సుధీర్" రచన "కుందేలు తెలివి".** తెలివిగల కుందేలు వేటగాడితో పందెంకాసి, తన ప్రాణం పణంగా పెట్టి వేటగాడిలో పరివర్తన వచ్చేలా చేసి శాఖాహారిగా మార్చి తన తోటి జంతువుల ప్రాణాల్ని కాపాడిన కథ ఇది. లోక హితార్థమిదం శరీరం అనే మానవీయ సూక్తిని కుందేలు ద్వారా చెప్పించారు.

ఐదోతరగతి **"అక్షిత"** రాసిన కథ **"జాలిమనసు".** శిశిరకి రోడ్డుమీద బిచ్చగత్తెకి స్నేహం కుదిరింది. తన పుట్టినరోజు కానుకగా ఆమెను ఇంటికి తీసుకురమ్మని శిశిర తండ్రిని కోరింది. మొదట ఆశ్చర్యపోయినా బిడ్డ కోరిక చెల్లించాడు తండ్రి. సంపన్నులైన ఒక్కొక్కరూ ఒక్కో వృద్ధుని దత్తత తీసుకుంటే అనాధ వృద్ధులు ఉండరని కథ ముగుస్తుంది. మానవీయ కోణంలో ఈ సంకలనానికి మకుటం లాంటి కథ ఇది.

**ముగింపు :** సంకలనంలోని కథకుల కథలన్నీ పఠనానుకూలత కలిగి ఉండటం గొప్పవిషయం. ప్రతికథలో తప్పకుండా అంతస్సూత్రంగానైనా ఒక నీతి ఇమిడి ఉండడం ఇంకా గొప్ప విషయం. మానవీయత అనేది ప్రతి విద్యార్థి మూర్తిమత్వంలోని అతి ప్రధాన అంశం. ఈ మానవీయపు గుండెతడి ఉన్న వ్యక్తి తప్పక గొప్ప రచయితో, కవో, కళాకారుడో కావడం తప్పదు. సమాజ పౌరునిగా, వ్యక్తిగా కూడా ఉన్నత విలువలు గలవానిగా నిలవాలంటే మానవీయత అనే గుణం తప్పదు. ఈ గుణాన్ని పుష్కలంగా కలిగిన కథల సమాహారం ఇది. ఈ సంకలనం తప్పకుండా చదువరుల మదిలో మానవీయ పరిమళాన్ని నింపుతుంది అనటంలో అతిశయోక్తి లేదు. ఈ సంకలనపు కృషిలో భాగస్వాములైన విద్యార్థులు, సంపాదకులు, ఎంపిక కమిటీ, ప్రచురణకర్తల కృషి ఫలవంతమైనది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఖమ్మం జిల్లా బడిపిల్లల కథలు, సంపాదకులు :మణికొండ వేదకుమార్
   చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ప్రచురణ- హైదరాబాద్-2019
2. బాల సాహిత్య వికాసం- వ్యాసం, కోమటి బుచ్చిరెడ్డి -9441561655
   నమస్తే తెలంగాణ దినపత్రిక, 21.05.2023
3. అనగనగా మా బడి పిల్లల కథలు, సంపాదకులు-మాడుగుల రాములు
   జెడ్పిహెచ్ఎస్ (బాలికలు) చొప్పదండి, కరీంనగర్జిల్లా-2023
4. తెలంగాణ జిల్లాల బడిపిల్లల కథలు – (10 సంపుటాలు)
   బాలచెలిమి ప్రచురణలు-హైదరాబాద్-2019.